పనివేళలు మార్చాలని గురుకుల ఉపాధ్యాయుల నిరసన

బెల్లంపల్లి, సెప్టెంబరు 18: పనివేళలు మార్చాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురుకుల ఉపాధ్యాయులు బుధవారం పాఠశాల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అన్ని గురుకుల సొసైటీల్లో ఒకే పనివేళలను నిర్ణయించిందని చెప్పారు. ఇది విద్యార్థులపై ఒత్తిడి పెంచే విధంగా ఉందన్నారు. విద్యార్థులకు అనుగుణంగా పనివేళలు మార్చాలని సూచించారు. కార్యక్రమంలో బబిత, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెదురు ఉత్పత్తులను ప్రోత్సహిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, సెప్టెంబరు 18: మేదర కులస్థులు ఎంతో కష్టపడి తయారు చేసిన వెదురు వస్తువుల అమ్మకాలకు ప్రభుత్వ పరంగా ప్రోత్సహిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ప్రపంచవెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అడవి మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న మేదరులు అటవీ అధికారుల వల్ల ఇబ్బందులు పడుతున్న విషయం తనకు తెలుసన్నారు. అడవి మీద ఆధారపడుతున్న మేదరులతో పాటు ఆదివాసీల సమస్యలపై ఇప్పటికే ఒక దఫా ప్రభుత్వంతో చర్చించామని, మేదర కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహేంద్ర సంఘం మండల అధ్యక్షుడు నరసింగరావు, ప్రధాన కార్యదర్శి రాజన్న, ఉపాధ్యక్షుడు నర్సయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజఫర్ అలీఖాన్, నాయకులు రాజశేఖర్, ఇసాక్, మోహన్‌రెడ్డి, మాణిక్యం, సతీష్, పసివుల్లా, ఇందయ్య, రాజన్న, రమేశ్, కరుణాకర్ పాల్గొన్నారు.

- గ్రామాల అభివృద్ధే ధ్యేయం

గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండల కేంద్రంతో పాటు మొర్రిగూడ, కిష్టాపూర్, మన్నెగూడ, కామన్‌పల్లి, మందపల్లి, పొన్కల్, శ్రీలంకకాలనీ తదితర గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 2.16 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లు,మురికి కాలువలు, ప్రహరీ గోడ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఐటీఐ కళాశాలను సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. కామన్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాయలంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, కాంగ్రెస్ నాయకులు ముజఫర్ అలీఖాన్, ఇసాక్, సతీష్, పసివుల్లా తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడికి ప్రత్యేక పూజలు



గూడెంలో వ్రతం ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, సెప్టెంబరు 18: భాద్రపద పౌర్ణమి పురస్కరించుకొని దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దంపతులు కుటుంబసమేతంగా సాముహిక వ్రతాలను ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. కాగా గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం ఉదయం స్వామి వారి హుండీని లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ తెలిపారు. మార్చి 26 నుంచి గురువారం వరకు భక్తులు స్వామి వారికి కానుకలుగా వేసిన హుండీని లెక్కించనున్నామని తెలిపారు.


నిర్వాసిత రైతుల నిరసన

నస్పూర్, సెప్టెంబరు 18: విలువైన భూములు కోల్పోతున్న తమకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట జైపూర్ మండల నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసితులు నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కరించాలని బుధవారం కలెక్టరేట్‌కు 10 గ్రామాలకు చెందిన రైతులు వచ్చారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ ఏవోకు అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ హైవే ద్వారా ముంపుకు గురయ్యే భూమికి ఎకరాకు రూ.50లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండో నోటిఫికేషన్ ద్వారా 8 నుంచి 9 లక్షల చెల్లిస్తామని, అధికారులు చెప్పడం తమను ఆందోళన కలిగిస్తుందన్నారు. తమకు తగిన న్యాయం చేయాలని రైతులు విన్నవించారు. కార్యక్రమంలో రామారావు, సుందిల్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

జన్నారం, సెప్టెంబరు 18 : ఆయిల్‌పామ్ సాగు, యాజమాన్య పద్ధతులపై బుధవారం జన్నారంలోని రైతు వేదికలో డీహెచ్ఎస్‌వో అనిత రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగు ను విస్తరించాలని సూచించారు. మ్యాట్రిక్స్ సంస్థ ప్రతినిధి ఉదయ్‌కుమార్ ఆయిల్‌పాం మార్కెటింగ్, రవాణా గురించి వివరించారు. బెల్లంపల్లి కేవీకే శాస్త్రవేత్త స్రవంతి ఆయిల్‌పాం సాగులో అంతర పంటల సాగు, చీడ పీడల యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌వో తిరుపతి, వ్యవసాయాధికారి సంగీత, ఏఈవోలు త్రిసంధ్య, దివ్య, లవన్ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల వైపు చూపు



- జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు చర్యలు
- సిద్ధమవుతున్న అన్ని ప్రధాన పార్టీలు
- అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్ఠాత్మకం
- గట్టిపోటీ ఇచ్చేందుకు బీజేపీ ప్రణాళికలు

మంచిర్యాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల లోక్‌సభ ఎన్నికల పర్వం ముగిసిన నేపథ్యంలో జిల్లాలో పట్టభద్రులు, అలాగే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల వ్యవహారం తెరపైకి వస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం రెండు ఎమ్మెల్సీల ఎన్నికలకు సంబంధించి కార్యాచరణ మొదలు పెట్టడంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ అదిశగా సన్నద్ధమవుతున్నాయి. ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పరిధిలో ఈ ఎన్నికలు పట్టబద్రులు, టీచర్లకు వేర్వేరుగా నిర్వహించనున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని 42 అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రస్తుతం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన జీవన్‌రెడ్డి, టీచర్ ఎమ్మెల్సీగా పీఆర్టీయూకు చెందిన రఘోత్తంరెడ్డిలు కొనసాగుతున్నారు.

అధికార పార్టీకి..

గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ సారి కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మకం కానున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ పార్టీ అధికారంగా ప్రటించనుండగా, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై మాత్రం ఆపార్టీ పరోక్షంగా మద్దతునివ్వాల్సి ఉంటుంది. రాష్ట్ర పీసీసీ బాధ్యులు హర్షవర్ధన్‌రెడ్డి నేతృత్వంలోని పీఆర్టీయూ తెలంగాణ, పీఆర్టీయూటీఎస్, అలాగే ఎస్టీయూ, యూటీఎఫ్‌తో పాటు మరికొన్ని ఉపాధ్యాయ సంఘాలు తమ మద్దతుదారులను బరిలో దింపనున్నాయి. కాగా పీఆర్టీయూటీఎస్ అభ్యర్థికిగాని హర్షవర్ధన్‌రెడ్డి నేతృత్వంలోని పీఆర్టీయూ తెలంగాణ అభ్యర్థికిగానీ కాంగ్రెస్ పార్టీ మద్దతునిచ్చే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇతర ప్రధాన రాజకీయ పార్టీలు కూడా అభ్యర్థులను బరిలో ఉంచబోతున్నందున కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందనే ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ లెఫ్ట్ భావాలు ఉన్న ఆర్ సత్యనారాయణ అభ్యర్థిత్వం విషయంలో సమాలోచనలు జరిగినట్లు సమాచారం.

యువతను ఆకట్టుకుని..

యువతను ఆకట్టుకుని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీని ఎలాగైనా కైవసం చేసు కోవాలన్న లక్ష్యంతో బీజేపీ కూడా పకడ్బందీగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో పార్టీకి నలుగురు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తుండడమే గాకుండా, ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలమైన కేడర్‌ను కలిగి ఉంది. ఈ కారణంగానే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పదవిని దక్కించుకోవాలని బీజేపీ పావులు కదుపుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పదవిని ఈసారి ఎలాగైనా చేజిక్కించు కోవాలని బీజేపీ యోచిస్తోందంటూ ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఆర్థికంగా కూడా బలంగా ఉన్న ఆయన అధిష్ఠానం అవకాశం ఇస్తే బరిలో దిగాలనే యోచనలో ఉన్నారు. కొత్తఓటర్ల నమోదుకు ఆయన చర్యలు తీసుకుంటున్నారని చెబుతున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఎదురుదెబ్బతిన్న బీఆర్ఎస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన అభ్యర్థిని బరిలో దింపి సత్తా చాటుకునేందుకు యత్నిస్తోంది.

వ్యూహాత్మకంగా అడుగులు

ప్రస్తుత ఎమ్మెల్సీల పదవీ కాలం మరో ఐదు నెలల్లో ముగియబోతున్న నేపథ్యంలో ఈ నెల 30 నుంచి నవంబరు 6వ తేదీ వరకు ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది మార్చి మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ సారి పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సుమారు 300 మండలాలకు చెందిన ఎనిమిది లక్షల మంది వరకు ఓటర్లు ఉంటారని అంచనా. కాగా మరో ఐదు నెలల గడువు ఉండగానే బరిలో నిలిచే అభ్యర్థులు పట్టబద్రుల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. గతంతో పోల్చితే పట్టభద్రుల సంఖ్య అధికంగా ఉండడం, వారి వివరాల సేకరణ కోసం నాలుగు ఉమ్మడి జిల్లాలు తిరగాల్సి రావడంతో ముందస్తుగానే ఆశావహులు ఎన్నికల పనిలో నిమగ్నమయ్యారు. కాగా ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ఎన్నికలను ప్రతిష్టాకంగా తీసుకోబోతోంది. ప్రస్తుతం పార్టీకి చెందిన జీవన్‌రెడ్డి పట్టు భద్రుల ఎమ్మెల్సీగా కొనసాగుతున్నప్పటికీ, ఈసారి ఆయన పోటీ చేసేందుకు విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా కాంగ్రెస్ మరో బలమైన అభ్యర్థిని బరిలోకి దింపాలని భావిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అ గతంలో బీఆర్ఎస్ నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఎన్నికై ఆ పార్టీ అధినేత కేసీర్ కారణంగా ఏడాదిలోనే పదవికి రాజీనామా చేసిన ఆర్ సత్యనారాయణ మరోసారి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఆయన ఎమ్మెల్సీగానే కాకుండా టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా కూడా కొనసాగారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం



నీటి సరఫరా పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, సెప్టెంబరు 18: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. అమృత్‌పథకంలో భాగంగా రూ. 61.50 కోట్లతో ఎల్లంపల్లి నుంచి బెల్లంపల్లికి గోదావరి నీటి సరఫరా పథకం పనులకు బుధవారం కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలందరికి గోదావరి నీటిని అందిస్తానని హామీ ఇచ్చానని, దీన్ని నెరవేర్చానన్నారు. హామీలను అమర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందన్నారు. 20 ఏళ్లుగా పట్టణ ప్రజలు గోదావరి నీటి కోసం ఎదురు చూస్తున్నారని, ప్రతి ఎమ్మెల్యే హామీలిచ్చారు కానీ నెరవేర్చలేదని, తాను నెరవేర్చానన్నారు. 11 నెలల్లో పనులు పూర్తయి ప్రజలకు గోదావరి నీరు అందుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ. 400 కోట్లను తీసుకువస్తానన్నారు. అనంతరం మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా నిర్మానాలను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, నాయకులు సూరిబాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి శివారు ప్రాంతంలోని సర్వే నెంబరు 3పైకి సోమగూడెం మెయిన్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసుకున్న నివాస గృహాల లబ్ధిదారులకు న్యాయం చేస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌లు సోమగూడెం దుకాణ సముదాయాలను పరిశీలించారు. గృహనిర్మాణ సముదాయాల బాధితులు మాట్లాడుతూ 2015లో 59 జీవో ప్రకారం ప్రభుత్వానికి డీడీలు చెల్లించామన్నారు. 35 సంవత్సరాలుగా గృహాలు, దుకాణ సముదాయాలు నిర్మించుకుని జీవిస్తున్నామని తెలిపారు. ఆందోళన చెందవద్దని అర్హులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

దండేపల్లి, సెప్టెంబరు 18: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని లక్షెట్టిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో రేష్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా దండేపల్లి మండలం చింతపల్లి 4వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దండేపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ జాడి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు

నస్పూర్, సెప్టెంబరు 18: శుభ్రత-పరిశుభ్రత కార్యక్రమ నిర్వహణ పక్షోత్సవాల సందర్భంగా బుధవారం నస్పూర్ పట్టణం తీగల్ పహడ్ జిల్లా పరిషత్ పాఠశాల అవరణలో దక్కన్ గ్రామీణ బ్యాంకు అధికారులు చెత్తాచెదారాన్ని తొలగించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీతారాంపల్లి శాఖ ఆధ్వర్యంలో పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి క్షేత్రాదికారి షేక్ హసాన్సెన్, పర్యవేక్షకుడు సురేష్, కాంట్రాక్టు ఉద్యోగి రవి, పాఠశాల ఉపాధ్యాయుడు వేణు గోపాల్ రావులతో పాటు బ్యాంకు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా మున్సిపాలిటీలోని 10వ వార్డులో బుధవారం మున్సిపల్ అధికారులు స్వచ్చత హీ సేవా -2024ను నిర్వహించారు. వార్డులో ఖాళీలో స్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్: పట్టణంలోని గోదావరి నదీ తీరంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం చెత్తాచెదారాన్ని తొలగించారు. మునిపల్ కమిషనర్ అల్లె మారుతీ ప్రసాద్ పాల్గొని ప్రారంభించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా నిమజ్జనం చేసిన వినాయకులను, ప్లాస్టిక్ కవర్లు, పూలదండలు, ఇతర వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో మేనేజర్ విజయ్‌కుమార్, సానిటరి ఇన్‌స్పెక్టర్ ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

జైపూర్‌లో సామాజిక తనిఖీ ప్రజావేదిక

జైపూర్, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద బుధవారం మహాత్మాగాం ధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ ప్రజావేదికకు డీఆర్‌డీవో కిషన్, అంబుడ్స్‌మెన్ దుర్గం శివరాంలు హాజరయ్యారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఆయా గ్రామాల్లో రూ. 2.71 కోట్ల పనులు జరగగా గ్రామాల వారీగా తనిఖీ బృందాలు నిర్వహించిన తనిఖీ నివేదికను ప్రజావేదిలో చదివి వివరించారు. ఈ తనిఖీల్లో పలు అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందాలు ప్రజావేదికలో వెల్లడించారు. మండలంలోని 20 గ్రామపంచాయతీలకు సంబంధించి రూ. 37,632 రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. 4 గ్రామపంచాయతీలకు సంబంధించి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ రీసోర్స్‌పర్సన్ ప్రదీప్‌కుమార్, మానిటరింగ్ అధికారి వేణు, ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్ డబ్ల్యూఎస్ డీఈఈ విద్యాసాగర్, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు

నస్పూర్, సెప్టెంబరు 18 : భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం భవన నిర్మాణ కార్మిక సంఘాల (జేఏసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ ఏవో రాజేశ్వర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వకుండా ప్రభుత్వ వెల్ఫేర్ బోర్డు ద్వారా నేరుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు అడ్వజయిరీ కమిటీ కార్మికుల సంఘాల ప్రతినిధులను నియమించాలన్నారు. ప్రమాద మరణాలకు 10 లక్షల సహజ మరణాలకు 5లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘాల (జేఏసీ) సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, బీఆర్‌టీయూ, బీఎన్ఆర్‌కేఎస్, టీఈఎన్‌టీ సంఘాల నాయకులు పడాల రామన్న, జాడి దేవరాజ్, డి. బ్రహ్మానందం, తాళ్లపల్లి శ్రీనివాస్, ఎం. మల్లన్న, మేకల రామన్న, రమేష్, సురేందర్, అరుణ, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జన శోభాయాత్ర

- హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు దీపేష్ రేన్వా

గర్మిళ్ల, సెప్టెంబరు 18: మంచిర్యాల పట్టణంలో మంగళవారం జరిగిన వినాయక నిమ్మజ శోభాయాత్ర ప్రశాంతంగా ముగిసిందని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు దీపేష్ రేన్వా తెలిపారు. బుధవారం మంచిర్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో సుమారు 2300 గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు గోదావరి నదిలో నిమజ్జనం ప్రశాంతంగా జరిగిందన్నారు. ఇందుకు అధికారులు, సిబ్బంది, రాజకీయ ప్రముఖులు ఎంతో సహ కారం అందించారని తెలిపారు. ప్రజలు, భక్తులు ప్రశాంతంగా కార్యక్రమం కొనసాగడానికి సహకారం అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు తది తరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సులభ రీతిలో బోధించాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 18: విద్యార్థులకు సులభ రీతిలో బోధించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మండలంలోని పెర్కపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, బట్వాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. తరగతి గదులు, పరిసరాలను, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందన్నారు, ఎలాంటి అసౌకర్యం లేకుండా పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుం టున్నామని చెప్పారు. తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు గదుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్య అందిస్తూ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ద్వారా మహిళలు, పిల్లల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందిస్తూ వారి ఆరోగ్యపరిస్థితులను పర్యవేక్షించాలని , మానసిక, శారీరక లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారు సాధారణ స్థితికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బట్వాన్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, కార్యాలయం పరిసరాలతో పాటు గ్రామంలో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

- అభ్యంతరాలుంటే తెలియజేయాలి

మంచిర్యాల కలెక్టరేట్: ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో డీపీవో వెంకటేశ్వర్‌రావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ ప్రతినిధులతఓ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాటాడుతూ జిల్లాలోని 311 గ్రామంపచాయతీల్లో మొదటి విడదతలో బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూర్,వేమనపల్లి, రెండవ విడతలో భీమారం, చెన్నూరు, జైపూర్, కోటపల్లి, మందమర్రి, మూడో విడతలో దండేపల్లి, హాజీపూర్, జన్నారం, లక్షెట్టిపేట మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నామని చెప్పారు. 311 గ్రామాల్లో 2,730 వార్డుల్లో 1,87,402 మంది పురుష ఓటర్లు, 1,91,468 మంది మహిళ ఓటర్లు, 17 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. ముసాయిదా జాబితాపై అందిన అభ్యంతరాలను ఈ నెల 26న పరిశీలించి 28న అన్ని గ్రామాల్లో ప్రచురించామని తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

నస్పూర్, సెప్టెంబరు 18: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి స్వరూపరాణికి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో మార్పులు చేస్తామన్నారు. మూడవ తరగతి వరకు పూర్వ ప్రాథమిక విద్యాను ప్రారంభించే నిర్ణయాన్ని తక్షణమే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. మూడవ తరగతి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యా బోదన ఉంటుందని భావించిన నూతన జాతీయ విద్యా విధానం చట్టం అమలులో భాగమేన్నారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు యూనియన్ అధ్యక్షురాలు భానుమతి, సభ్యులు సత్యవతి, అనురాధ, మహేశ్వరి, భారతీ, సరిత, పద్మ, శారదా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

భీమారం, సెప్టెంబరు 18: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ మండల అధ్యక్షులు బోర్లకుంట శంకర్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా కన్వీనర్ ఎనగందుల కృష్ణమూర్తి, అసెంబ్లీ కన్వీనర్ రమేష్ సభ్యత్వం అందించారు. కార్యకర్తలు సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాజేష్ యాదవ్, సతీష్, దుషాంత్ యాదవ్, జనార్ధన్, మల్లేష్, సుధాకర్, రాము,సాయి, సందీప్, విజయ పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

కాసిపేట: సింగరేణిలో జరుగుతున్న గని ప్రమాదాల్లో వరుసగా కార్మికులు మృతిచెందుతున్నారని, ఇవి గని ప్రమాదాలు కావని, యాజమాన్యం చేస్తున్న హత్యలేనని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. బుధవారం సోమగూడెంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

తాండూర్: మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) మండల మహాసభను బుధవారం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శిగా దాగాం రాజారాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మందమర్రిటౌన్: టీబీజీకేఎస్ డిప్యూటి జనరల్ సెక్రటరీగా వెంకటరమణ నియమిస్తూ యూనియన్ అధ్యక్షుడు రాజిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

మంచిర్యాల కలెక్టరేట్: మంచిర్యాలలో ట్రాన్స్‌కో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ శ్రీధర్ ఆధ్వర్యంలో 327 మంది జేఎల్ఎంలు, అసిస్టెంట్‌లు చేరారు.

దండేపల్లి: మండలంలోని పలు గ్రామాలోని ఏర్పాటు చేసిన గణనాథులను గూడెం సమీపంలో గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.

మంచిర్యాల అర్బన్: మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ జల పర్యవేక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు నీటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేలా రూపొందించిన గోడ ప్రతులను విడుదల చేశారు.

మందమర్రి టౌన్: పలు ప్రైవేటు పాఠశాలల్లో ట్రస్మా మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేపట్టారు.

బెల్లంపల్లి: పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో శేఖర్‌రావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 18: మందమర్రి కేకే 5గనిలో మృతిచెందిన కార్మికుడు లక్ష్మణ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పోచ మల్లు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మృతని గని ప్రమాదంగా గుర్తించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గోపినాధ్ సంగన్న, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు?

చెన్నూరు, సెప్టెంబరు 18: పట్టణంలోని శనగకుంట చెరువును ధ్వంసం చేసిన ఘటనలో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పట్టణంలోని మహంకాళివాడకు చెందిన కొంత మంది, ఎల్లక్కపేటకు చెందిన మరికొంత మందిని ఆధీనంలోకి తీసుకుని విచారిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. బ్లాస్టింగ్‌కు ఉపయోగించిన జనరేటర్‌తో పాటు డిటోనేటర్లు, జిలెటిన్ స్టిక్స్ పదార్థాలు, విద్యుత్‌వైరు ఎవరు సమకూర్చారు. అవి ఎక్కడ నుంచి తీసుకువచ్చారనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు సమాచారం. జాతీయ రహదారి 63 గోదావరి రోడ్డు వద్ద అమర్చిన సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానంతో దుండగులను గుర్తించి పోలీసులు విచారిస్తున్నారు.

పట్టణంలో భారీ వర్షం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 18: పట్టణంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంట సేపు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కాలనీల్లోని రోడ్లు జలమయ మయ్యాయి. మార్కెట్ రోడ్డు బురదవయంగా మారింది. వర్షంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో, భాగ్యనగర్ కాలనీలో నీరు చేరింది. ఊరు రామకృష్ణపూర్‌లోని పలు నివాసాల్లో వరదనీరు చేరింది.

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్, సెప్టెంబరు 18: మండలంలోని ఆదర్శ పాఠశాలలో హవర్లీ బేస్డ్ ప్రతిపాదికన ఫిజిక్స్‌ను బోధించేందుకు అర్హులైన వారికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సారతస్మీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, బీఈడీ చేసి ఉండాలని, 24లోగా పాఠశాలలో సర్టిఫికెట్లతో సంప్రదించాలని సూచించారు.

తాండూర్: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశా లలో రెండు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో స్వీపర్, వాచ్‌మన్‌లు ఖాళీ ఉన్నాయని తెలిపారు.

అనారోగ్యంతో ఉన్న.. స్వదేశానికి పంపించండి

దండేపల్లి, సెప్టెంబరు 18: అనారోగ్యంతో బాధపడుతున్నానని, స్వదేశానికి పంపించాలని దండేపల్లి మండలం మేదరిపేట పంచాయతీ పరిధిలోని మదాపూర్ చెందిన చల్ల గోపాల్ విజ్ఞప్తి చేశాడు. గోపాల్ ఇరాక్ దేశం ఉపాధి కోసం వెళ్లాడు. గత 45రోజుల నుంచి తీవ్ర అనారోగ్యం సమస్యతో ఇబ్బంది పడుతున్న అక్కడి కంపెనీ వారు ఇంటికి పంపడం లేదని బుధవారం వాట్సాప్ వీడియో కాల్ ద్వారా తన గోడును ఇక్కడి విలేకరులకు వెల్లబోసుకున్నాడు. 45 రోజుల నుంచి కాళ్ల నొప్పలు తదితర అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని వాపోయాడు. ఇక్కడి వైద్యులకు చూపించినా నయం కావడంలేదని రోదించాడు. తెలంగాణ ప్రభుత్వం స్పందించి తనను ఇండియాకు రప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరాడు.

కిడ్నాప్ చేసిన నిందితుల రిమాండ్

లక్సెట్టిపేటరూరల్, సెప్టెంబరు 18: లక్సెట్టిపేట మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యులైన పందిరి లింగయ్య , గుమ్ముల సంతోష్ అనే ఇద్దరు వ్యక్తులను కిడ్నాప్ చేసిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ తెలిపారు. బుధవారం లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమఆవేశంలో ఆయన వివరాలను వెల్లడిం చారు. ఈ నెల 14న లక్ష్మీపూర్ మత్స్యకారుల సహకార సంఘం ఎన్నికల సందర్భంగా శాకపురం శంకరయ్య సహకార సంఘం అధ్యక్షుడిగా పోటీ చేశారు. మత్స్యపారిశ్రామిక సంఘంలో 31 మంది సభ్యులు పాల్గొంటున్నారు. శంకరయ్యకు మద్దతుగా 15 మంది సభ్యులు ఉన్నారు. అతడికి పోటీ దారుడు అయిన అరుగుల నర్సయ్యకు 16 మంది సభ్యులు మద్దతుగా ఉంది. శాకపురం శంకరయ్య గ్రామ ఎన్నికల్లో గెలిస్తే జిల్లా అధ్యక్షుడిగా గెలవచ్చని భావించాడు. ఎన్నికల్లో గెలవాలని వ్యతిరేక వర్గంలోని ఇద్దరు సభ్యులైన పందిరి లింగయ్య, గుమ్ముల సంతోష్ మద్దతు కోరాడు. వారు మద్దతుకు నిరాకరించడంతో ఓటింగ్ రోజున పాల్గొనకుండా తప్పించాలని పథకం వేశాడు. ఈ మేరకు వారిని కిడ్నాప్ చేయాలని అతడి మిత్రులైన మున్నాను ఆశ్రయించాడు. దీంతో మున్నా తన స్నేహితులైన దేవేందర్, ఎల్లయ్య, రవి, తరుణ్‌లతో వారిని కిడ్నాప్ చేసేందుకు బేరం కుదుర్చు కున్నారు. ఆ ఇద్దర్ని ఈ నెల 13న కిడ్నాప్‌చేశారు. ఎన్నికల కోసం తన భర్త లింగయ్యను కిడ్నాప్ చేశారని అతడి భార్య సరోజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా నింది తులు కరీంనగర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్నారనే సమాచారంమేరకు అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ అల్లం నరేందర్, లక్సెట్టిపేట ఎస్ఐ సతీష్, సిబ్బంది మురళి, అంజిబాబు, తిరుపతి, సునీల్‌ను ఏసీపీ అభినందించారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

బెల్లంపల్లి, సెప్టెంబరు 18: పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద బుధవా రం మద్యం మత్తులో వ్యక్తి మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలం తంగళ్లపల్లికి చెందిన చాపల మల్లేష్ (35) కూలీ పనులు చేసుకుంటూ జీవించేవాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య మరొకరిని వివాహం చేసుకుంది. ఈ క్రమంలో మద్యానికి మరింత బానిసయ్యాడు. ఇద్దరు కుమారులు, తండ్రిని పట్టించుకోకుండా మద్యం సేవిస్తూ జులాయిగా తిరుగుతున్నాడు. మంగళవారం సాయంత్రం బెల్లంపల్లికి వచ్చిన మల్లేష్ కాంటా ఏరియాలోని ఓ వైన్‌షాపులో మద్యం సేవించాడు. రాత్రి కావడంతో అక్కడి పరిసరాల్లో నిద్రపోయాడు. తాగడానికి నీరు అందుబాటులో లేక మద్యం మత్తులో మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు

మున్సిపాలిటీ రికార్డుల నుంచి ఇంటి నంబర్లు తొలగింపు

చెన్నూరు, సెప్టెంబరు 18: చెన్నూరు పట్టణ శివారులోని సర్వే నెంబరు 840లోని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఇళ్లకు గతంలో కేటాయించిన ఇంటి నంబర్లను బుధవారం రికార్డుల నుంచి తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. 840లోని ప్రభుత్వ భూమిలో అమృత్ 02 పథకం ద్వారా రూ. 31 కోట్ల వ్యయంతో నిర్మించేవాటర్ ట్యాంకు నిర్మాణా నికి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌లు శంకుస్థాపన చేసిన విషయం విదితమే. కాగా భూమిలోనే అప్పటికే నిర్మించిన ఇంటి నిర్మాణాలు వారి దృష్టికి వచ్చాయి. అయితే ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాల గురించి విచారణ కోసం మున్సిపాలిటీ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారికి మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్లు జారీ అయ్యాయి. దీంతో గత కొన్ని రోజుల క్రితం మున్సిపాలిటీ అధికారులు ఇంటి నిర్మాణాలు చేపట్టిన 34 మంది యాజమానులకు నోటీ సులు జారీ చేశారు. కాగా ఆన్‌లైన్ రికార్డుల్లోఇంటి నంబర్లను తొలగించారని తెలియడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

హాజీపూర్, సెప్టెంబరు 18: మండలంలోని దొనబండ గ్రామానికి చెంది న గుండవేణి బూదమ్మ (60) జీవితంపై విరక్తి చెంది బుధవారం బావిలో దూకి ఆత్మహత్యచేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బూదమ్మ గత రెండు సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడింది. భర్తఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మందమర్రిలో కార్మికుడి మృతి

- గని ప్రమాదంగా గుర్తించాలంటూ కార్మికులు, కార్మిక సంఘాల ఆందోళన
- మూడు గంటల పాటు విధుల బహిష్కరణ



కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు

(ఇన్‌సెట్‌లో మృతి చెందినమోకెనపల్లి లక్ష్మణ్(ఫైల్))

మందమర్రి టౌన్, సెప్టెంబరు 18: మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిలో కోల్ కట్టర్‌గా విధులు నిర్వహిస్తున్న స్థానిక స్టేషన్ రోడ్డు భాగ్యనగర్ కాలనీకి చెందిన మోకెనపల్లి లక్ష్మణ్ (45) మంగళవారం రాత్రి మృతి చెందాడు. లక్ష్మణ్ రెండో షిఫ్టు విధులు ముగించుకొని మ్యాన్ రైడిం గ్‌పై వస్తూ మధ్యలో ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తోటి కార్మికులు లక్ష్మణ్‌ను ఏరియా ఆసుపత్రికి ఆంబులెన్స్‌లో తర లించారు. లక్ష్మణ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బుధవారం ఉదయం విషయం తెలుసుకున్న కార్మికులు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గని ప్రమాదంగానే గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. యాజమాన్యం పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాతనే తాము ముం దుకు వెళ్తామని అధికారులు చెప్పడంతో కార్మికులు డప్పులు కొడుతూ నినాదాలు చేస్తూ గని ఎదుట బైఠాయించారు. విధులు ముగించుకొని పైకి వస్తుండగా గనిలోని 2 లెవల్ వద్ద పడిపోయాడని, అక్కడ స్ట్రెచ్చర్ లేకపోవడంతో భుజాలపై ఎత్తుకొని వచ్చామని కార్మికులు మండిపడ్డారు. దీనిని గని ప్రమాదంగానే గుర్తించి మృతుని కుటుంబానికి యాజమాన్యం అన్ని విధాలుగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జీఎం దేవేందర్ అక్కడికి చేరుకుని కార్మికులతో మాట్లాడారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పినప్పటికి కార్మికులు శాంతించలేదు. మూడు గంటల పాటు విధులను బహిష్కరించారు. చివరికి పైకి తీసుకువచ్చిన కార్మికులు అప్పటికే గనిలోనే చనిపోయి పడి ఉన్నాడని, పైకి తీసుకువ చ్చిన కార్మికులు సంతకాలు చేసి గని అధికారులకు అందజేశారు.

దీనిని గని ప్రమాదంగా గుర్తించి మృతుని కుటుంబానికి న్యాయం చేసే విధంగా చూడాలని కూడా వారు కోరారు. ఒక దశలో పలు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతుంటే కార్మికులు వారితో వాగ్వాదానికి దిగారు. తమతో పని చేసే కార్మికుడు గనిలో మృత్యువాత పడితే యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి న్యాయం జరిగేలా చూడకుండా సంబంధం లేని విషయాలను ఎందుకు ప్రస్తావిస్తున్నారని మండిపడ్డారు. జీఎం దేవేందర్ మాట్లాడుతూ ఇది తమ చేతిలో ఏమి లేదని, కార్మికుడి కుటుంబానికి అన్ని విధాలా న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. కార్మి క సంఘాలతో కూడా ఈ విషయాన్ని చర్చించారు. చివరికి కార్మికులు విధులకు హాజరయ్యారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహానికి మం చిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం లక్సెట్టిపేటలోని కిషన్‌రావు పేటలో ఆయన అంత్యక్రియలను నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకెళ్లారు. గనికి చెందిన కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. కాగా ఏరియాలోని కేకే 5 గనిలో విధులు ముగించుకుని మ్యాన్‌రైడింగ్ నుంచి పైకి వస్తుండగా ప్రమాదవశాత్తూ కింద పడి మృతిచెందిన కోల్ కట్టర్ కార్మికుడు లక్ష్మణ్ మృతిని గని ప్రమాదంగా గుర్తించాలని కార్మిక సంఘాల నాయకులు సలేంద్ర సత్యనారాయణ, భీమనాధుని సుదర్శన్, కాంపెల్లి సమ్మయ్యదేవి భూమయ్య, రాజశేఖర్,మేడిపల్లి సంపత్, నాగరాజు గోపాల్, ఎస్. వెంకటస్వామి, అల్లి రాజేందర్ కోరారు.. బుధవారం కేకే 5 గనిపై వారు మాట్లాడుతూ ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల రక్షణపై యాజమాన్యానికి ఉండడం లేదు. కార్మికుడు కింద పడ్డాడని డిస్పెన్సరీకి ఫోన్ చేస్తే డ్రైవర్ ఒక్కడే వచ్చాడని, డాక్టర్ కానీ, నర్సులు కానీ రాకపోవడం శోచనీయమన్నారు. రాత్రివేళలో వైద్యులు ఉండడం లేదన్నారు. గని ప్రమాదంగా గుర్తించి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబరు 18: ఇందిరా మహిళా శక్తి స్కీం ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచముఖి హను మాన్ సంఘం సభ్యురాలు మంగకు చెందిన క్యాంటీన్‌ను బుధవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య ప్రారం భించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అల్లె మారుతీ ప్రసాద్, మేనేజర్ విజయ్‌కుమార్, జేఏఓ అనిత, మెప్మా టీఎంసీ చంద్రయ్య, సీఓలు టి.సుజాత, బి అరుణ, వి సరోజ, ఆపరేటర్ డి.సునిత, రిసోర్స్ పర్సన్‌లు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 18: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరే ణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడ బ్ల్యూ-ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి. బ్రహ్మానందం, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వారి ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు గొట్టె శీను, యాద గిరి, శోభ, అప్పారావు, ఎం శంకర్, అశోక్, తిరుపతి, రాజ న్న, బాపు, అప్పలరాజు, సురేష్, ఐలయ్య, బక్కయ్య, రమే ష్, గురువులు, రాజా కిరణ్, ఈశ్వరరావు, లలిత, రాజకళ, పద్మ, రమ, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు టీకా తప్పనిసరిగా వేయించాలి

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 18: పిల్లలకు టీకా తప్పనిసరిగా వేయించాలని ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఎవాంజిలినా అన్నారు. తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎనిమిది అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు బుధవారం ఆరోగ్య కేంద్రం వైద్యురాలు గ్రోత్ మానిటరింగ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పిల్లల తల్లులకు పౌష్టికాహారం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. పిల్లలకు టీకాలను క్రమం తప్పకుండా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధి కారి స్వరూపరాణి, ఐసీడీఎస్‌సూపర్ వైజర్ పుష్పలత, ప్రసన్న, విష్ణుప్రియ, ప్రభావతి, అంగన్‌వాడీ టీచర్లు,ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. అనంతరం తాళ్లగురిజాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురా లు ఎవాంజిలినా పిల్లల ఎత్తు, బరువు మధ్య చేతి కొలత చూసి తగిన సూచనలు ఇచ్చారు. పౌష్టికాహా రం అందించాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ మల్లిక, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సీడీపీవో స్వరూపరాణి, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని గవర్నర్‌కు రైతుల లేఖలు

నెన్నెల, సెప్టెంబరు 18: మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలోని రైతులు రుణమాఫీ చేయాలని బుధవారం గవర్నర్‌కు లేఖలు రాశారు. మూకుమ్మడిగా మండల కేంద్రానికి చేరుకున్న రైతులు తమ ఉత్తరాలను రిజిస్టర్ పోస్టు చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షల పంట రుణం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, నాయకులు ఎండీ ఇబ్రాహీం, పురంశెట్టి తిరుపతి మద్దతు తెలిపారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

తాండూర్, సెప్టెంబరు 18: గ్రామాల్లో నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీఐ కుమారస్వామి అన్నారు. బుధవారం మండలంలోని ఎంవీకే 5 ఇంక్లైన్ గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామంలోనికి ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వాహనదారులు అన్ని రకాల ధ్రువపత్రాలతో రోడ్డు మీదకు రావాలన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే 1930కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై సౌజన్య, హెడ్ కానిస్టేబుల్ తుకారాం, పోలీసులు రమేష్, శశికుమార్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

భీమిని, సెప్టెంబరు 18: మండల కేంద్రంలో బుధవా రం మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని భీమిని పోలీసు లు పట్టుకున్నారు. భీమిని పోలీస్ స్టేషన్ పరిధిలోని చుట్టు పక్కల గ్రామాల నుంచి సేకరించిన మూడు క్వింటాల్ల రేషన్ బియ్యాన్ని వాహనాల్లో అక్రమంగా కాగజ్‌నగర్ వైపునకు తరలిస్తుండగా ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో భీమిని వద్ద పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న పెద్దపల్లి జిల్లాలోని రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన చెందిన సునీల్‌కుమార్, మంచిర్యాలలోని ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన చింతల శ్యామల్ అనే వ్యక్తులను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీరు మండలంలో పలు గ్రామాల్లో బియ్యం సేకరించి మహారాష్ట్రకు బియ్యం తరలిస్తారని ఎస్సై తెలిపారు. అనంతరం బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామన్నారు. కార్యక్రమం లో ఏఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ రాజ్ కుమార్, మల్లేష్, పోచమల్లు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ కమిటీ ఎన్నిక

జైపూర్, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని తహసీ ల్దార్ కార్యాలయం ఎదుట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్నిఏర్పాటు చేయడం కోసం మండల విగ్రహ ఆవి ష్కరణ కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు మాజీ ఎంపీ టీసీ మంతెన లక్ష్మణ్, మాలమహానాడు చెన్నూరు నియో జకవర్గ అధ్యక్షుడు శీలం వెంకటేష్ తెలిపారు. కమిటీ సభ్యులుగా ఇరిగిరాల మల్లేష్, ఇరిగిరాల లింగయ్య, నీలం రాజయ్య, దుర్గం లింగయ్య, గోనె నర్సయ్య, లక్ష్మణ్, రాజన్న , ఆసంపల్లి శ్రీకాంత్, గంగాధరి రాజయ్య, తిరుపతి, మధుకర్, గద్దల వెంకన్న, తిరుపతి, సింగన్న, రామగిరి మల్లేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం కోసం అనేక పోరాటాలు చేశామన్నారు. అంబేద్కర్ భవనం, విగ్రహం లేకపో వడంతో ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి దృష్టికి తీసుకువె ళ్లగా విగ్రహం ఏర్పాటుకు, భవన నిర్మానానికి కావాల్సిన నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దీనికి అనుగుణంగ సభ్యులను ఎన్నుకున్నామని తెలిపారు.

డిటోనేటర్లు అమర్చి మత్తడిని పేల్చడం దారుణం

- బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్

చెన్నూరు, సెప్టెంబరు 18: పట్టణంలోని శనగకుంట చెరువు మత్తడిని దుండ గులు డిటోనేటర్లు అమర్చి పేల్చివేయడం దారుణమని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణ బీజేపీ నాయకులు ధ్వంసమైన మత్తడిని పరిశీలించారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణ నడిఒడ్డున ఉన్న చెరువు మత్తడిని బాంబులతో పేల్చడం అవమానవీయ ఘటన అన్నారు. పేలుడుతో సంఘ విద్రోహ శక్తులకు సంబంధం ఉండే అవకా శం ఉన్నందున నేషనల్ ఇన్వెస్టిగేషన్ అథారిటీ (ఎన్‌ఐఏ) విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చెరువులోనీ నీరంతా వృధాగా పోవడంతో ఆయకట్టు రైతులకు ఎకరానికి రూ. 25 వేల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. జరిగిన ఘటనపై ంమంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. మత్తడిని డిటోనేటర్లు పెట్టి ధ్వంసం చేసిన దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు జాడి తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ బత్తుల సమ్మయ్య, కౌన్సిలర్ కమ్మల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీపాల్ పాల్గొన్నారు.

నిమజ్జనంలో గాయపడిన కార్మికుడు మృతి

- చికిత్స పొందుతున్న మరో కార్మికుడు
- పరిహారంచెల్లించాలని కుటుంబసభ్యుల డిమాండ్
- రూ.5 లక్షల చెక్కు అందజేసిన అధికారులు



రూ.5లక్షల చెక్‌ను అందజేస్తున్న అదనపుకలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే హరీష్ బాబు, (ఇన్‌సెట్లో) నగేష్(ఫైల్)

కాగజ్‌నగర్, సెప్టెంబరు 18: కాగజ్‌నగర్‌లో మంగళవారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనంలో గాయపడిన కార్మికుడు నగేష్(46) బుధవారం కరీం నగర్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు నగేష్, రాజేష్ వినాయకవిగ్రహాన్ని పెద్దవా గులో వేసే క్రమంలో ఒక్కసారిగా క్రేన్ అదుపుతప్పింది. దీంతోనగేష్,రాజేష్ క్రేన్‌బైరుభాగంలో చిక్కుకుపోయారు. నగేష్(46)కు కాళ్లకు తీవ్రగాయాల య్యాయి. అలాగే రాజేష్‌కు స్వల్పగాయాలయ్యాయి.

● పరిహారం కోసం బైఠాయింపు..

తమకు న్యాయం చేయాలని నగేష్ మృతదేహంతో కుటుంబ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠా యించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీ ణ్‌కుమార్ మాట్లాడుతూ నగేష్ కుటుంబానికి వెంటనే పరిహారం రూ.20ల క్షలు, ఇంటిలో ఒకరికిఉద్యోగం ఇవ్వాలని డిమాండుచేశారు. సిర్పూరు ఎమ్మెల్యే హరీష్‌బాబు కూడా నగేష్ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్‌ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు సుధాకర్ మాట్లా డుతూ అర్థరాత్రి వరకు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులతో విధులు చేయించ టం తప్పన్నారు. వెంటనే న్యాయం చేయాలని డిమాండు చేశారు. నిరసన చేస్తున్న నగేష్ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావి శ్రీనివాస్ సందర్శించి పరామర్శించారు.

● రూ.5 లక్షల చెక్ అందజేత

పరిహారంపై ఎమ్మెల్యే హరీష్‌బాబు, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డా క్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సెక్రెటరీ సుధాకర్, సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్, మృతుడి కుటుంబసభ్యులు అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్‌శ్రద్ధా శుక్లా, మున్సిపల్ మాజీచైర్మన్ దస్తగీర్, కమిషనర్ అంజయ్య, విజిలెన్స్ ఎస్పీ అశ్వేశ్వ ర్‌రావు, డీఎస్పీలు తదితరులు చర్చలు జరిపారు. నగేష్ కుటుంబానికి రూ.5ల క్షల చెక్ అందజేశారు. రూ.15లక్షలు ఇన్సురెన్స్ డబ్బులు, ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి ప్రకటించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే హరీష్‌బాబు తనవంతు రూ.లక్ష ఇస్తున్నట్టు ప్రకటించారు. చర్చలు సఫలం కావటంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

చింతలమానేపల్లి, సెప్టెంబరు 18: మండలంలోని బాబాపూర్, కర్జవెల్లి తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా బాలింతలు, చిన్నపిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంగళ, శ్రీలత, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అన్నప్రాసన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఆసిఫాబాద్‌లో కొనసాగిన నిమజ్జనోత్సవం

● ఉత్సాహంగా సాగిన నిమజ్జన శోభాయాత్ర ● పోలీసుల భారీ బందోబస్తు ● పెద్దవాగులో నిమజ్జనం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 18: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జనోత్సవం బుధవారం ఉత్సాహంగా సాగింది. గణపతిబప్ప మోరియా, జై బోలో గణేష్ మహారాజ్ అంటూ భక్తి శ్రద్ధలతో గణనాథుడికి పూజలు నిర్వహించి గంగమ్మ సన్నిధిలో నిమజ్జనానికి తరలించారు. డీజే పాటలు, బ్యాండ్ చప్పుళ్లు, మహిళల మంగళహారతులు, కోలాటాలు, యువత కేరింతలు నృత్యాల మధ్య గణేషుడి శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రధాన వీధులగుండా ఈ శోభయాత్రను నిర్వహించారు. 11రోజుల పాటు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనోత్స వానికి వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి గణనాథుడికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయా గణేష్ మండ పాల వద్ద నిర్వాహకులు చేపట్టిన లక్కీడిప్‌కు డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. నిమజ్జనోత్సవ ంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ కరుణా కర్, సీఐ సతీష్ నేతృత్వంలో ఎస్సైలు ప్రత్యేకపోలీసు బలగాలతో గట్టి బందోబస్తు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పెద్దవాగులో గణనాథులను నిమజ్జనం చేశారు.



నిమజ్జనానికి తరలుతున్న గణేషుడు







నిమజ్జనానికి తరలుతున్న గణేషుడి వాహనాల ఎదుట మహిళలు, యువకుల నృత్యాలు

గిరి గ్రామాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్సీ దండె విఠల్

పెంచికలపేట, సెప్టెంబరు 18: గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ దండెవిఠల్ అన్నా రు. బుధవారం మండలంలోని కమ్మర్‌గాం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు గ్రామానికి రోడ్డుసరిగ్గాలేక బస్సులు రావడంతో లేదని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన ఆయన నందిగామ నుంచి బెజ్జూరువరకు మొరం రోడ్డు నిర్మాణానికి రూ.10లక్షలఅందిస్తామని హామీ ఇచ్చా రు. రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్య ర్థులను గెలిపించేందుకు పనిచేయాలన్నారు. మంత్రి సీతక్క, సీఎందృష్టికి గిరిగ్రామాల సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అనంతరం సీనియర్ నాయ కుడు బుచ్చిరాంను పరామర్శించి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట మాజీ ప్రజా ప్రతినిధులు పుష్పలత, మదనయ్య, చంద్రమౌళి, హర్షద్, జగ్గాగౌడ్, సిడాం గణపతి, శ్రీవర్ధన్, కృష్ణ, శంకర్‌గౌడ్, ఇలియాస్, సదాశివ్,బాపు, బాపురావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలి..

బెజ్జూరు: ఆదివాసీల సమ స్యలను పరిష్కరించాలని ఆది వాసీ కొలావార్ సేవాసంఘం నాయకులు ఎమ్మెల్సీ దండెవిఠల్ ను కోరారు. బుధవారం మండ లానికి వచ్చిన ఆయనకు స్వాగ తం పలికి సమస్యలను విన్నవిం చారు. కొలావార్, మన్నెవార్ సేవాసంఘం భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిడాంగణపతి, మల్లేష్, లక్ష్మణ్, భాగ్య, సతీష్,వెంకటి,వినోద్, నగేష్,వెంకటేష్, ఎంగొంతయ్య, టి.గొంతయ్య, ప్రకాష్, సాయి, మల్లేష్, లక్ష్మి, అపర్ణ, సంధ్య పాల్గొన్నారు.



బెజ్జూరులో దండె విఠల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ కొలావార్ నాయకులు

కాంగ్రెస్ పార్టీలో చేరిక..

మండలానికిచెందిన బీఆర్‌ఎస్‌పార్టీ మాజీసర్పంచ్ సుగుణ, మాజీఎంపీటీసీ భాగ్య, వార్డుసభ్యులు లలిత ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వా నించారు. కార్యక్రమంలో ఆదివాసీనాయకులు ఓంప్ర కాష్, జగ్గాగౌడ్, పుష్పలత, సదాశివ్, శ్రీవర్ధర్, రాజన్న, రమేష్, హర్షద్, నాహీర్‌అలీ, సురేష్‌గౌడ్, శ్రీనివాస్, రాజశేఖర్, శైలేష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి

వాంకిడి, సెప్టెంబరు 18: పిల్లలు, బాలింతలు, గర్భిణులు ప్రతి ఒక్కరూ వ్యాధి నిరోధకటీకాలు వేయించుకోవాలని ఆరోగ్యశాఖ విస్తరణ అధికారి రవిదాస్ సూచించారు. బుధ వారం మండలంలోని బండకాస, దాబాగ్రామాల్ని సందర్శించి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు, గర్భిణులకు టీకాలు వేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం గోదావరి, ఆశాకార్యకర్త బాగుబాయి, దిలీప్, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు టీకాలు వేస్తున్న ఏఎన్‌ఎం

చిన్న రాస్పెల్లిలో విచారణ

దహెగాం, సెప్టెంబరు 18: మండలంలోని చిన్నరా స్పెల్లిగ్రామంలోని పాఠశాల ఎదుట ప్రభుత్వ భూమిలో అక్రమకట్టడాలు నిర్మించడంతో పాఠశాల హెచ్‌ఎం సునీత కలెక్టర్‌కు ఫిర్యాదు చేవారు. దీంతో ఎంపీడీవో రాజేందర్ బుధవారం విచారణ చేపట్టారు. అక్రమంగా నిర్మించిన కట్టడాలను పరిశీలించారు. నివేదికను కలె క్టర్‌కు అందజేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఆయన వెంట ఎంఆర్ఐ నాందేవ్, సర్వేయర్ ధన్‌రాజ్, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, కార్యదర్శి నరేష్ తదితరులు ఉన్నారు.

'గంగాపూర్‌వార్డు విభజన సరిచేయాలి'

రెబ్బెన, సెప్టెంబరు 18: గంగాపూర్ వార్డు విభజన సరిచేయాలని కోరుతూ బుధవారం మాజీసర్పంచి గంటుమేర ఆధ్వర్యంలో ఎంపీడీవో శంకరమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లా డుతూ పదివార్డుల జాబితాలో అన్నీ తప్పులే ఉన్నట్టు వివరించారు. ఒకే కుటుంబసభ్యులను వెర్వేరు వార్డులో ఉన్నాయన్నారు.

'కార్యదర్శులు అభ్యంతరాలు స్వీకరించాలి'

సిర్పూర్(టి), సెప్టెంబరు 18: గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యం, మహిళాశక్తి, ఈజీఎస్ పనులు, ఓటరుజాబితాపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితాపై అభ్యంతరాలు వస్తే స్వీకరించాలన్నారు. గ్రామీణప్రాంతాల్లో మురికి కాలు వలు, పారిశుధ్యం, ఈజీఎస్‌పనులపై దృష్టి సారించా లన్నారు. ఏపీవో చంద్రయ్య, కార్యదర్శులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
గురువారం 19 సెప్టెంబరు 2024



ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగ్గుతున్న ప్రసవాలు

- నిలిచిపోయిన కేసీఆర్ కిట్ల పంపిణీ
- అందని న్యూట్రిషన్ కిట్లు



కాగజ్‌నగర్, సెప్టెంబరు 18: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోంది. సాధారణ ప్రసవాలు జరగాలన్న సదుద్దేశ్యంతో చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలు కూడా లబ్ధిదారులకు అందడం లేదు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్‌కిట్‌తో సాధారణ డెలివరీ జరిగితే రూ.10వేల ఆర్థిక సహాయం అందించేవారు. కాన్పు తర్వాత తల్లిని, కుటుంబ సభ్యులను ఇంటివరకు అంబులెన్స్ దించేవారు. ప్రభుత్వ ఆసుపత్రులకు చెల్లించాల్సిన బిల్లులు రాకపోవటంతో కేసీఆర్ కిట్‌ల పంపిణీ జరగలేదు. ఆర్థికసాయం బిల్లులు పెండింగ్‌లోనే ఉంది. వెరసి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు చేసుకునేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి చూపించటం లేదు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న ఏఎన్ఎం, నర్సులను డిప్యూటేషన్ పేరిట ఇతర చోట్లకు బదిలీలు చేయటంతో సిబ్బంది కొరత ఏర్పడుతోంది. దీంతో లక్ష్యం మేర కాన్పులు చేయలేని పరిస్థితి ఏర్పడిందని సిబ్బంది పేర్కొంటున్నారు. పదిహేను రోజుల క్రితం మాతా శిశు సంరక్షణశాఖ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ సిద్ధార్థ్ కాగజ్‌నగర్, పెంచికల్‌పేట, బెజ్జూరు, దహెగాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను తనిఖీ చేశారు. సాధారణ ప్రసవాలకు ఎందుకు తగ్గుతున్నాయి అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాగజ్‌నగర్ కేంద్రంలో 2023లో అక్టోబరులో 76, నవంబరులో 89, డిసెంబరులో 84, 2024సంవత్సరంలో జనవరిలో 70, ఫిబ్రవరిలో 80, మార్చి 42, ఏప్రిల్ 30, మే 25, జూన్ 32, జూలై 38, ఆగస్టులో 42 సాధారణ ప్రసవాలు తగ్గినట్టు రికార్డుల్లో తేలింది. గతేడాది 70కిపైగా సాధారణ కాన్పులుండగా, ఈ సంవత్సరం సగానికిపైగా పడిపోవటంపై కారణాలను అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని సిబ్బందికి సూచనలు చేశారు.

నాలుగేళ్లుగా పెండింగ్‌లోనే..

జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు పెంచాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్‌లు, పాప పుడితే రూ.13వేలు, బాబు పుడితే రూ.12వేలు చెల్లించేది. దీంతో ఒక్కసారిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకోవడానికి సాధారణ ప్రజలు ఆసక్తి చూపారు. వీటితో పాటు న్యూట్రీషన కిట్‌లను కూడా అందజేసేవారు. అయితే రెండేళ్ల నుంచి ఇవేమీ అమలు కావడం లేదు. కాన్పుల లక్ష్యం చేరేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్న ఇంతవరకు పురోగతి లేదు. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందనే కోణంలో జిల్లా అధికారులు విచారణ చేపడుతున్నారు.

ముఖ్యంగా కేసీఆర్ కిట్లు, న్యూట్రీషన్ కిట్లు, ప్రసవానంతరం నగదు ఇవ్వకం పోవటంతోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు తగ్గిపోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. అంతేకాకుండా ప్రైవేటు ఆసుపత్రులకు గర్భిణుల తరలింపులో సిబ్బంది పాత్ర ఏమైనా ఉందా? అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు.

ప్రసవాల సంఖ్య పెరిగేలా చూస్తున్నాం..

డాక్టర సిద్ధార్థ్, జిల్లా మాతా శిశుసంరక్షణ శాఖ ఇన్‌చార్జి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరి గేలా చర్యలు తీసుకుంటున్నాం. సాధారణ కాన్పుల తగ్గుతున్న విషయంపై వాకబు చేశాం. బకాయిలు కొంతమేర పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు కూడా కిట్లు కూడా అందాల్సి ఉంది. ఇంకా రాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.



కాగజ్‌నగర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం

శాంతిభద్రతల పరిరక్షణతోనే అభివృద్ధి సాధ్యం: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

తిర్యాణి, సెప్టెంబరు 18: శాంతి భద్రతలతోనే అభివృద్ధి సాధ్యమని ఎస్పీ డీవీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం తిర్యాణి పోలీసుస్టేషన్‌లో ఆదివాసీనాయకులు,పటేళ్లు, సర్‌మేడిలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాపోలీసులు శాంతి భద్రతల పరిరక్షణతోపాటు జిల్లాలో ప్రజలు, ఆదివాసీల అభివృద్ధి కోసం అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ, వివిధ సహకారసంస్థల సహాయంతో మహిళలకు జీవనోపాధి నిమిత్తం కుట్టు మిషన్‌లు అందించడంవంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. రోడ్డువేయించడం, వంతెనలను నిర్మించడం, టవర్స్ నిర్మించడం, పేదలకు మెడికల్‌క్యాంపు, కంటివైద్యపరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి ఆపరేషన్‌లను చేయిస్తామన్నారు. ఎవరి కైనా సమస్య ఉంటే వాటిని శాంతియుతమార్గం ద్వారా ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ప్రతిఒక్కరూ చదువుకొని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. పోలీసులు ఎల్లప్పుడు ప్రజాసంక్షేమం కోసమే పాటుపడుతారన్నారు. అదేవిధంగా పోలీసుల తరఫున మీసేవసెంటర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో స్థానిక ప్రజలకు అవకాశం కల్పించేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, సీఐ చిట్టిబాబు, ఎస్సైలు మాదవ్, రామారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిర్పూర్(టి), సెప్టెంబరు 18: మండలంలోని వెంకట్రావుపేట సమీపంలో బుధవారం నాలుగున్నర క్వింటాళ్లబియ్యం పట్టుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ మేరకు అక్కేపల్లి నాందేవ్, పుల్లలే తిరుపతిపై కేసునమోదు చేసినట్లు ఎంఆర్ఐ మోహన్ తెలిపారు. ఈ దాడిలో సీనియర్ అసిస్టెంట్ గోపాల్, రెవెన్యూసిబ్బంది సాగర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారన్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలి: కలెక్టర్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 18: గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్లజాబితాపై అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియజేయాలని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్‌తివారితో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ముసాయిదా ఓటర్లజాబితా ప్రచరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడతూ జిల్లాలో 335గ్రామ పంచాయతీల్లో గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితా వార్డులవారీగా ప్రచురించామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల21లోగా గ్రామకార్యదర్శి ఎంపీడీవో కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలని తెలిపారు. ముసాయిదాజాబితాపై అందిన అభ్యంతరాలు ఈనెల 26న పరిశీలించి 28న ఓటరు జాబితా అన్నిగ్రామపంచాయతీ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయం, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో ప్రచురిస్తామన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో పొందుపర్చు తామన్నారు. పొరపాట్లు లేని ఓటరు జాబితా రూపొందించే దిశగా బూత్‌స్థాయి అధికారులకు, రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు సహకరించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీవో భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

విద్యాభివృద్ధికి కృషి..

ఆసిఫాబాద్‌రూరల్: విద్యాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. మండలంలోని గుండి ప్రభుత్వ పాఠశాలను పదవతరగతి వరకు అప్‌గ్రేడ్‌చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో బుధవారం గుండి మాజీ ఎంపీటీసీ మల్లేష్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వవిద్యను బలోపేతం చేసేందుకు చర్యలు చేడతామన్నారు. ప్రజలు సైతం ప్రభుత్వ విద్యాసంస్థలను ఆదరించి తమపిల్లలను ప్రభుత్వబడిలో చదివించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈవో ఉదయబాబు, అబ్దుల్లా, అమన్, దత్తు, శ్యాంరావు, అసద్ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం ధాన్యం సేకరణపై ప్రణాళికలు రూపొందించాలి

- రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 18: వానాకాలం (2024) ధాన్యం సేకరణపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల అదనపుకలెక్టర్‌లు,పౌరసరఫరాల శాఖ అధికారులు, సహకార,మార్కెటింగ్‌శాఖల అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వానాకాలం ధాన్యం సేకరణకు ముందస్తుకార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ప్రణాళికబద్ధంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు నిర్వహించాలన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ నుంచి అదనపుకలెక్టర్ మాట్లాడుతూ 2024వానాకాలం వరిధాన్యంసేకరణపై ముందస్తు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. జిల్లాలోని రైస్‌మిల్లులను గుర్తించి కొనుగోలుకేంద్రాల్లో గన్నీసంచులను అవసరం మేరకు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొనుగోలుకేంద్రాలను ముందస్తుగా గుర్తిస్తామన్నారు. టార్పాలిన్‌లు, తూకం యంత్రాలను సమకూర్చు కోనే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైస్‌మిల్లుల సామర్థ్యం మేరకు కేటాయించిన ధాన్యం సంబందిత సీఎంఆర్ లక్ష్యాలను త్వరగాపూర్తి చేసేందుకు పర్యవేక్షిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ జిల్లామేనేజర్ పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 18: జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఓటరుజాబితాపై అన్నిరాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఓటరు జాబితా ప్రదర్శించిన నేపథ్యంలో ఏమైనా తప్పులుంటే సవరించడానికి వీలుగా అన్నిరాజకీయపార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. నాయకులు సకాలంలో హాజరు కావాలన్నారు.

బెజ్జూరు: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అన్నిరాజకీయపార్టీల నాయకులతో ఓటరుజాబితాపై సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో గౌరీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిపార్టీల ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 18: తెలంగాణ గిరిజన గురుకుల బాలికలపాఠశాల క్రీడామైదానంలో బుధవారం ఫుట్‌బాల్ జిల్లాస్థాయి అండర్-14,17బాలబాలికల క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఇన్‌చార్జిడీఈవో ఉదయబాబు, ప్రధానోపాధ్యాయుడు అరుణ, హెచ్‌జీఎఫ్‌సెక్రెటరీ సాంబశివరావు తెలిపారు. వీరిని ఆదిలాబాద్‌లో నిర్వహించే జోనల్ స్థాయికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో పీడీ మధుసూదన్, పీఈటీలు, రవి, వనిత, తదితరులున్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 18: సమస్యలు పరిష్కరించాలని బుధవారం టీఎస్‌యూటీఎఫ్, గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో భోజన విరామంలో గురుకుల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రనాయకురాలు శాంతికుమారి, రాజ్‌కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని పాఠశాలలకు ఒకే రకంగా పనివేళలు ఉండాలని డిమాండ్ చేశారు. మళ్లీ పాత టైంటేబుల్ ప్రవేశపెడుతూ నిర్ణయం తీసుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. విద్యార్థులు ఉదయం ఏడు గంటలకే అల్పాహారం చేసి 4పీరియడ్స్ కంటిన్యూగా జరగడంవలన ఇబ్బందులు ఉంటాయన్నారు. అలాగే ఆయా గురుకులాలల్లో పార్ట్‌టైం, గెస్ట్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, అన్ని రకాల సెలవులు వర్తింపచేయాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, 010 పద్ధతిలో వేతనాలు అందించాలని, మహిళా ఉపాధ్యాయులకు రాత్రిపూట స్టడీఅవర్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల22,23తేదీల్లో జిల్లాకలెక్టర్లకు, శాసనసభ్యులకు మోమోరాండలు సమర్పిస్తామన్నారు. 28న హైదరాబాద్‌లో మహాధర్నా కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లాఉపాధ్యక్షురాలు ప్రీతి, బాలక్రిష్ణ,హరిక్రప్రసన్న, కళాశాలప్రిన్సిపాల్ రూమిప్రతిభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిర్పూరు నియోజకవర్గంలో గ్రూపు విభేదాలు లేవు



సమావేశంలో మాట్లాడుతున్న రావిశ్రీనివాస్

కాగజ్‌నగర్, సెప్టెంబరు 18: సిర్పూరు నియోకవర్గంలో ఎలాంటి గ్రూపు విభేదాలు లేవని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానికంగా మాట్లాడారు. సిర్పూరు కాంగ్రెస్‌లో గ్రూప విబేధాలున్నట్టు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని తెలిపారు. ఎమ్మెల్సీ దండే విఠల్ గతంలో ప్రభుత్వభూములను కబ్జా చేసిన నాయకులను వెంటవేసుకొని తిరుగుతూ పార్టీకి నష్టం చేయవద్దని సూచించారు. తనకు మర్యాద ఇవ్వకపోయిన మంచిదేకాని, దళితుడైన మార్కెట్ ఛైర్మన్ సిద్దాల దేవయ్యకు మర్యాద ఇవ్వాలని సూచించారు. సమావేశంలో మార్కెట్‌కమిటీ ఛైర్మన్ సిద్దాల దేవయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ రత్నం శ్రీకాంత్, వార్ల తిరుపతి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నష్టపోకుండా చూడాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 18: ఆసిఫాబాద్, సిర్పూర్(యు) ఆదర్శపాఠశాలల్లో బోధన సిబ్బంది బదిలీకగా ఇక్కడికి ఎవరూ రాలేదని విద్యార్థులు నష్టపోకుండా చూడాలని బుధవారం అఖిలపక్షంనాయులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల బదిలీలతో విద్యాబోధన ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వెంటనే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సతీష్‌బాబు, విశాల్, జీవన్, దినకర్, కార్తీక్, చిరంజీవి, మురళీ, సలీం, జయరాజ్, మధర్ హుస్సేన్, ప్రశాంత్, వినోద్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 35 పశువుల పట్టివేత

సిర్పూర్(టి), సెప్టెంబరు 18: చత్తీస్‌గడ్ నుంచి కర్ణాటక రాష్ట్రం కొల్లాపూర్‌కు అక్రమంగా తరలిస్తున్న 35పశువులను పట్టుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తమకు అందిన సమాచారం మేరకు బుధవారం పోలీసుస్టేషన్ పరిధిలో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో చత్తీస్‌గడ్ నుంచి కర్ణాటకు రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న పశు వులను పట్టుకుని గోశాలకు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కర్ణాటకు చెందిన పశువుల యజమాని సి రాంచంద్రతోపాటు నవాబ్‌ఖాన్, సలాలుద్దీన్, అల్తాఫ్ ఖాన్, ఎస్కే ఆదిల్‌పాషా, ఆదీప్‌పాషాపై కేసు నమోదు చేసి పశువుల అక్రమ రవాణాపై దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

పీపీరావు ప్రాజెక్టు కాలువ గండి పూడ్చివేత

దహెగాం, సెప్టెంబరు 18: మండలంలోని కుంచవెల్లి గ్రామసమీపంలో పీపీరావు ప్రాజెక్టు ఎడమకాలువకు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గండిపడింది. బుధవారం బీజేపీనాయకులు గండికి మరమ్మతులు చేయించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీధర్,సాయిక్రిష్ణ, భీమేష్,రాకేష్, భీమన్న, సంతోష్ పాల్గొన్నారు.



గండిని పూడ్చుతున్న బీజేపీ నాయకులు

ఎస్పీఎం యాజమాన్యం మొండివైఖరి మానుకోవాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్, సెప్టెంబరు 18: సిర్పూరు పేపర్‌మిల్లు యాజమాన్యం మొండివైఖరి మానుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం తన నివాసంలోఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీఎం యాజమాన్యం ఈప్రాంత కార్మికులకు తీవ్రంగా అన్యాయం చేస్తోందన్నారు. మిల్లు నుంచి వెలువడే కాలుష్యం ఈ ప్రాంతవాసులు తీసుకొని అవస్థలు పడుతుంటే ఇక్కడివారికి మాత్రం జీతాలు రూ.20వేలు, స్థానికేతరులకు రూ.40వేల వరకు జీతాలివ్వటం దారుణమన్నారు. యాజమాన్యం కార్మికుల పట్ల అణగదొక్కే ధోరణి మానుకోవాలన్నారు. ఎస్పీఎం క్రీడామైదానంలో ఎగ్జిబిషన్‌ను వెంటనే ఎత్తివేయాలన్నారు. ఈ ప్రాంతంలోని కార్మికులకు ఇంతవరకు విధుల్లోకి తీసుకోకుండా కాలయాపన చేయటం సరికాదన్నారు. మున్సిపాల్ కాంట్రాక్టు కార్మికుడు నగేష్ మృతిచెందటం బాధకరమన్నారు. ప్రభుత్వం వెంటనే పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు లెండుగురే శ్యాంరావు, సలీం, దాసరి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

బేకరీల యజమానులకు జరిమానా

వాంకిడి, సెప్టెంబరు 18: మండలకేంద్రంలోని బేకరీల యజమానులకు రూ.5వేల జరిమానా విధించినట్లు కార్యదర్శి శివకుమార్ తెలిపారు. బేకరీలో కాలం చెల్లిన సరుకులు అమ్ముతున్నట్లు వచ్చిన ఫిర్యాదుమేరకు తనిఖీచేయగా అయిదు బేకరీలలో కాలంచెల్లిన సరుకులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇక మీదట ఎవరైనా కాలంచెల్లిన వస్తువులు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



'రిటైర్డ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 18: తమకు ప్రభుత్వ సంక్షేమపథకాలు అందించాలని రిటైర్డ్‌కార్మికులు డిమాండ్ చేశారు. సింగరేణి రిటైర్డ్‌ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం తమ సమస్యలతో కూడిన పోస్టుకార్డులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పంపించారు. తాము అతితక్కువ పెన్షన్ పొందుతున్నామని, వయోభారం వల్ల వచ్చే వ్యాధులకు మందులు కొనలేని స్థితిలో ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే తెల్లరేషన్ కార్డు, వృద్ధాప్య, ఆసరా పింఛన్, ఉచితంగా అపరిమిత వైద్య సౌకర్యాలు, 200గజాల ఇంటిస్థలం, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రవంలో అసోసియేషన్ ఉప ప్రధానకార్యదర్శి అళవందార్ వేణుమాధవ్, మంచిర్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, సభ్యులు రాజన్న, సత్తయ్య, నర్సయ్య, రాజమల్లు, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించండి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 18: ఆర్కే7గని నుంచి ఆర్కేన్యూటెక్ వెళ్లే రోడ్డు సమస్యను పరిష్కరించాలని న్యూటెక్ గని కార్మికులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు బుధవారం గని సంక్షేమాధికారి పాల్‌సృజన్‌కు వినతిపత్రం అందించారు. ఆర్కే7 మూలమలుపు వద్ద ఉన్న ఫ్యాన్ ఎదురుగా రోడ్డు బురదమయంగా మారిందన్నారు. వాహనాలు జారి కార్మికులు కింద పడుతున్నారన్నారు. ఎండాకాలంలో దుమ్ముతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. రోడ్డు సమస్యను పరిష్కరించి రక్షణ కల్పించాలని వారు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జె కుమార్, కస్తూరి చంద్రశేఖర్, బొడ్డు సురేందర్, తిరుపతి రెడ్డి, బుద్ధి ప్రసాద్, పెరుక సదానందం, తిరుపతి, రాజారాం, శ్రీనివాస్, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో అవినీతి, అక్రమాలను సహించం: సీఎండీ

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, సెప్టెంబరు 18: సింగరేణిలో అవినీతి, అక్రమాలను సహించేది లేదని సీఎండీ ఎన్ బలరామ్ అన్నారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని సింగరేణిభవన్ నుంచి విజిలెన్స్ విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మెడికల్‌బోర్డు, ఇతర పనుల పేరుతో కొంతమంది దళారులు కార్మికులను మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారి సమాచారాన్ని విజిలెన్స్ విభాగం ఫోన్‌నంబర్ 9491144104కు తెలపాలన్నారు. సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచడంతోపాటు బహుమతులు కూడా ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు అందించి అన్‌ఫిట్ అవుతున్న వారికి కంపెనీ ద్వారా లభించే టర్మినల్ బెనిఫిట్స్ నిలిపివేస్తామని హెచ్చరించారు. అనారోగ్య కారణాలతో బాధపడే వారి కోసమే కారుణ్యనియామక ప్రక్రియను అమలు చేస్తున్నట్లు స్పష్టంచేశారు. సంస్థలో చేసే కాంట్రాక్టు పనుల్లో నాణ్యత పాటించని పక్షంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు చేపడతామన్నారు. 272ఎక్స్‌టర్నల్ పోస్టులకు ఇటీవల నిర్వహించిన ఉద్యోగ పరీక్ష ప్రొవిజినల్ మెరిట్‌లిస్టును విడుదల చేసినట్లు పేర్కొన్నారు. త్వరలోనే మిగిలిన 327పోస్టుల ఫలితాలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు తీసుకుంటామని సీఎండీ వివరించారు. సమావేశంలో కొత్తగూడెం నుంచి జీఎం(విజిలెన్స్) ప్రసాదరావు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.



వీసీ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్న సీఎండీ

'వాస్తవ లాభాల్లో 35శాతం వాటా ఇవ్వాలి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 18: సింగరేణి కార్మికులకు వాస్తవ లాభాల్లో 35శాతం వాటాఇవ్వాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంచె భూపతి, టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి తలారి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటనవిడుదలచేశారు. గతఆర్థిక సంవత్సరంలో సంస్థకు వచ్చిన వాస్తవలాభాలను వెంటనే ప్రకటించి, వాటిలో 35శాతం కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు సైతం పర్మినెంట్ కార్మికుల మాదిరిగా లాభాల వాటా, దసరా అడ్వాన్స్, పీఎల్ఆర్ బోనస్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కార్యాలయ గదులను తనిఖీ చేసిన జీఎం

రెబ్బెన, సెప్టెంబరు 18: బెల్లంపల్లి ఏరియా గోలేటి జీఎం కార్యాలయంలోని అన్ని డిపార్టుమెంట్లను స్వచ్ఛతా పఖ్వాడ కింద బుధవారం జీఎం శ్రీనివాస్ తనిఖీ చేశారు. స్టోర్ రూంలో వృథాగా పడేసి ఉన్న వస్తువులను క్రమపద్ధతిలో ఉంచాలన్నారు. గోడల పగుళ్లు మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. బీరువాలకు పెయింట్ వేయాలన్నారు. ఆయన వెంట ఎస్‌వోటు జీఎం రాజమల్లు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహర, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్ ఎస్ఈ భాష, ఫైనాన్స్ మేనేజర్‌రవికుమార్, ఎన్విరాన్మెంటు అధికారి రమేష్ తదితరులున్నారు.